


RNI NO. TELTEL/2014/61071

# జన తెలంగాణ

తెలుగు దిన పత్రిక

PUBLISHED PROM:HYDARABAD,KARIMNAGAR,KAMMAM,V IZAYAWADA,KADAPA,THIRUPATHI

సంపుటి : 14 సంచిక :146 | గురువారం సెప్టెంబర్ 17,2026 | ఎడిటర్ - ఆర్. చైతన్య | పేజీలు 8 | వెల-5




## భూవివాదం..

### మోదీ స్కూల్‌మేట్‌కు దక్కిన ఊరట



ఏళ్ల నాటి భూవివాదంలో ప్రధాని మోదీ స్కూల్‌మేట్ అస్గర్‌అలీ వోహ్రాకు ఊరట లభించింది. ఈ వివాదం నుంచి వెనక్కి తగ్గిన స్థానిక భాజపా ఎమ్మెల్యే.. ప్రధాని స్నేహితుడికి భూమిని అప్పగించారు. ఈ ఆస్తి వ్యవహారం గురించి అస్గర్ అలీ ఇటీవల మోదీ ని కలిసిన కొన్ని రోజులకే తాజా పరిణామం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..మహారాష్ట్రలోని ఠాణె జిల్లాలో నివసిస్తోన్న 81 ఏళ్ల అస్గర్‌అలీ వోహ్రా.. గుజరాత్ (+బయిఖీఫ్)లోని భయందర్ ఈస్ట్‌లో గల నవ్‌ఘర్ రోడ్డులో ఉన్న సుమారు 2,810 చదరపు మీటర్ల భూమిని 1989లో కొనుగోలు చేశారు. 02

## భారత నౌకను ఢీకొట్టిన పాక్ నౌక



02

## ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలు బయటకు తీయాలి:

- ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలు బయటపెట్టాలి.
- ధరణి తప్పిదాలతో ప్రజలకు నష్టం జరిగిందని కూనంనేని.
- 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూములపై వివరాలు వెల్లడించాలి.
- భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలి.
- నిజాం కాలం భూముల వివరాలు వెలికితీయాలి.
- 22ఏలో సాంకేతిక తప్పిదాలు జరిగాయని వ్యాఖ్య.



02

## వివేకా హత్య కేసు నిందితులకు చుక్కెదురు



హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితులకు చుక్కెదురైంది. నిందితుల డిశ్చార్జ్ పిటిషన్లను నాంపల్లి సీబీఐ కోర్టు తిరస్కరించింది. ఏ1 గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్‌రెడ్డి, ఏ6 ఉదయ్ పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వాటికి విచారణార్హత లేదని కోర్టు పేర్కొంది.

## గురుకులాల పనివేళలపై వివరణివ్వండి: హైకోర్టు

తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనివేళల మార్పుతోపాటు ఉపాధ్యాయులకు బోధనేతర విధులు అప్పగించడంపై వివరణివ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 02

## అసెంబ్లీలో సీఎం మాట్లాడినవన్నీ పచ్చి అబద్ధాలు:



- సీఎం వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలని హరీశ్‌రావు విమర్శ.
- 22ఏపై బీఆర్ఎస్ పోరాటం నిజమైందని వ్యాఖ్య.
- 22ఏ భూముల సమస్య 30 లక్షల ఎకరాలకు పెరిగిందని ఆరోపణ.
- కలెక్టర్లు పాత జాబితా అప్‌లోడ్ చేశారని విమర్శ.
- 22ఏ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ కోరినట్లు వెల్లడి.
- భూ భారతి చలాన్ల స్కామ్‌పై చర్యలు లేవని ఆరోపణ.
- భూ భారతి ద్వారా 9,200కుపైగా అక్రమ లావాదేవీలు జరిగాయని ఆరోపణ.

హైదరాబాద్: 22ఏ భూములపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు.

మిగతాది 2లో

## తిరుమలలో ఎస్వీ మ్యూజియం,

### ఈవీ బస్సులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు







ఈవీ బస్సుల ప్రారంభోత్సవం



ఎస్వీ మ్యూజియం ప్రారంభం

- తిరుమల: తిరుమలలో ఏపీ సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు.
- తిరుమల వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించారు.
- అనంతరం రిలయన్స్, భారత్ బయోటెక్ సంస్థలు విరాళంగా ఇచ్చిన ఈవీ బస్సులను నారాయణగిరి ఉద్యానవనాల వద్ద ప్రారంభించారు.

శ్రీవారి సేవలో అభివృద్ధి దిశగా మరో అడుగు...


మిగతాది 2లో

## సీఎం చెప్పిన భూముల చిట్టాపై నిజాలు నిగ్గు తేలాలి: కవిత



మిగతాది 2లో

## ఈనెల 19 నుంచి ఉమెన్ ఏపీఎల్: కేశినేని చిన్ని



విజయవాడ: ఆంధ్ర ప్రిమియర్ లీగ్ తరహాలోనే ఉమెన్ ఏపీఎల్ పోటీలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు విజయవాడ ఎంపీ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) వెల్లడించారు. 02

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
గురువారం సెప్టెంబర్ 17,2026

# సంపాదకీయం

## బీజేపీ రాజకీయాలకు బ్రిక్స్ పాఠం!



'లోకంలో బలవంతుడైనవాడు చెబితే అధర్మం కూడా ధర్మం అవుతుంది. అదే బలహీనుడు చెప్పే ధర్మం ఎంత గొప్పదైనా దాన్ని ఎవడూ అంగీకరించడు' అని మహాభారతంలో భీష్ముడు కురుసభలో ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో చెబుతాడు. 'పాండవులకు జరిగిన అవమానమే భవిష్యత్తులో కౌరవులకు వ్యతిరేకంగా ప్రత్యర్థులందర్నీ ఏకం చేస్తుంది' అని అదే సభలో విదురుడు హెచ్చరిస్తాడు. 'బలవంతుడి శక్తి కంటే భయంతో ఏకమైన బలహీనుల కూటమి శక్తిమంతమైనది' అని విదురుడు చెప్పినట్లుగానే పాంచాల, మత్స్య, యాదవ, మగధ, ఛేది, కాశీ, పాండ్య, చోళ, కేకయ తదితర రాజ్యాలన్నీ పాండవుల తరఫున ఏకం అవుతాయి. చాణక్యుడైనా, ఇటాలియన్ రాజనీతిజ్ఞుడు మాకియవెల్లీ అయినా ఇంతకంటే భిన్నంగా ఏమీ ఆలోచించలేదు. న్యూఢిల్లీలో గతవారం ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మహాభారతంలోని దౌత్యనీతి ప్రస్ఫుటించింది.

తాను అత్యంత బలవంతుడిననుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను వ్యక్తిగతంగా బ్రిక్స్ దేశాలు పైకి పల్లెత్తు మాట అనకుండానే ఆయనకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించాయి. ఏక పక్ష దౌర్జన్య చర్యలు, వర్తకాన్ని దెబ్బతీసే టారిఫ్ లను న్యూఢిల్లీ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. బ్రిక్స్ వేదికపై విభిన్న ప్రయోజనాలను ఆశిస్తున్న అనేక దేశాలు ఏకమయ్యేందుకు అవసరమైన వాతావరణాన్ని ట్రంప్ అనాలోచితంగానే అందించారు. సంక్షుభిత ప్రజాస్వామ్య భారత్, నియంతృత్వ చైనా, రష్యా దేశాలు, అమెరికాతో సన్నిహిత భద్రతా సంబంధాలు ఉన్న గల్ఫ్ దేశాలు, అమెరికా దాడిని ఎదుర్కొంటున్న ఇరాన్.. ఇవన్నీ ఒక వ్యూహాత్మక ప్రాపంచిక దృక్పథాన్ని పంచుకునేందుకు అవకాశాన్ని ట్రంప్ కల్పించారు. అమెరికా అధ్యక్షుడి దూకుడు విధానాల వల్ల ఈ దేశాలన్నీ ఒత్తిడి ఎదుర్కోవడమే ఇందుకు కారణం. డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే దేశాలపై అత్యధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ చెల్లింపు విధానాలను వెతుక్కునేందుకు ఆయనే దోహదం చేశారు. వాణిజ్యం కోసం, స్థానిక జాతీయ కరెన్సీల వాడకాన్ని న్యూఢిల్లీ డిక్లరేషన్ సమర్థించింది. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ఇది సభ్య దేశాలకు ఊతమిచ్చింది.

భిన్న రాజకీయ వ్యవస్థలు, భద్రతా ప్రయోజనాలు కలిగిన కూటమి అయినప్పటికీ ఎలాంటి రణగొణ ధ్వనులు లేకుండా బ్రిక్స్ సమావేశంలో అత్యంత సమగ్రమైన, ప్రభావదాయక ఏకగ్రీవ డిక్లరేషన్‌ను విడుదల చేయగలగడమే ఆ దేశాల మధ్య ఏర్పడిన ఉమ్మడి అవగాహనకు నిదర్శనం. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ ఏకపక్ష ఆర్థిక ఒత్తిళ్లకు గురవుతోందనే సాధారణ భావనే వీటన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చింది. ఈ సదస్సుకు భారత్ నాయకత్వం వహించినందువల్ల సహజంగానే రెండు రోజుల పాటు జరిగిన సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర బిందువుగా నిలిచారు.

భారత్ ప్రస్తుత పరిస్థితి కత్తి మీద సాము లాంటిది. పలు వైరుధ్యాలతో కూడిన సంబంధాలను ఏకకాలంలో సమన్వయం చేసేందుకు భారత్ ప్రయత్నించాల్సి వచ్చింది. చైనాతో సరిహద్దు ఘర్షణలు, ఆర్థిక ఆధిపత్యం నేపథ్యంలో ఆ దేశాధినేతతో సుహృద్భావ వాతావరణంలో చర్చించడం, రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం, సంక్షుభిత పశ్చిమాసియాలో ఇరాన్‌తో చర్చలు జరపడం, అభివృద్ధి చెందిన దేశాల గళంగా, గ్లోబల్ సౌత్ నేతగా అవతరించేందుకు ప్రయత్నించడం ఇందులో ముఖ్యమైనవి. అంతేకాదు, రష్యాతో రక్షణ, ఇంధన రంగ సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని భారత్ స్పష్టం చేసింది. పాశ్చాత్య కూటములతో చేతులు కలుపుతూనే, సంప్రదాయ మిత్రులను విస్మరించబోమనే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ప్రకటించింది. అదే సమయంలో, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ సదస్సులో ఒక సున్నితమైన దౌత్య వ్యూహాన్ని అవలంబించారు. పశ్చిమ దేశాలను తిరస్కరించడం పూర్తిగా తమ వ్యూహం కాదని, ఆ దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ఏకకాలంలో కాపాడుకోవాలన్నదే భారత్ వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఒత్తిడి, చైనా ఆధిపత్యం మధ్య భారత్ తనను తాను ఒక ఆచరణాత్మక ప్రత్యామ్నాయంగా ప్రదర్శించుకోవడానికి ప్రయత్నించింది. అదే సమయంలో వాషింగ్టన్ ఎంత గట్టిగా ఒత్తిడి తెచ్చినా, దానిపై ఆధారపడకుండా యంత్రాంగాలను అభివృద్ధి చేయగలమని చెప్పగలగడమే ఈ బ్రిక్స్ సమావేశాల ప్రత్యేకత.

చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ఈ సదస్సులో చేసిన ప్రసంగం అత్యంత శక్తిమంతమైనది. 'నియమాలు లేని ప్రపంచం అంటే ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి వంటిది. అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాల భాగస్వామ్యంతోనే, అందరికీ ఒకే విధంగా ఉండేలా రూపొందించాలి. బలవంతుడిదే న్యాయం అనే సిద్ధాంతానికి అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎలాంటి స్థానం ఉండకూడదు. ప్రపంచ దక్షిణ దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను (రూల్ ఆఫ్ లా) సమష్టిగా పరిరక్షించాలి' అని జిన్ పింగ్ అన్నారు. బహుళ ధ్రువ ప్రపంచం అనే దాన్ని ఎవరూ మార్చలేరని, ప్రపంచాన్ని తమకోసం సుందరవనంగా, ఇతరులకు కీకారణ్యాలుగా మార్చేందుకు చేసే ప్రయత్నాలు చెల్లవని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. జారిపోతున్న తమ నాయకత్వాన్ని కాపాడుకోవడానికి పాత నేతలు కొందరు ఆంక్షలు, అడ్డంకులు సృష్టిస్తున్నారని, కానీ ఇవి ప్రత్యామ్నాయ, స్వతంత్ర వాణిజ్య మార్గాలను వేగవంతం చేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగంలోనూ బలమైన వ్యాఖ్యలు లేకపోలేదు. 'మనం నిబంధనలను పాటించేవారిగా (రూల్--టేకర్స్) కాకుండా, నిబంధనలను నిర్దేశించేవారిగా (రూల్--షేపర్స్) ఎదగాల్సిన అవసరం ఉంది' అని మోదీ చెప్పారు. టెక్నాలజీని, కీలక ఖనిజాలను ఆయుధాలుగా వాడుకోవద్దని ఆయన హెచ్చరించారు.

బ్రిక్స్ సదస్సులో అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య దాదాపు 45 నిమిషాల పాటు ద్వైపాక్షిక సమావేశం. వ్యూహాత్మక భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ పరస్పర ఆర్థిక ప్రయోజనాలకోసం పనిచేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు వెలువడ్డాయి. గల్వాన్ ఘర్షణల చేదు జ్ఞాపకాలను మరిచి, వాస్తవాధీన రేఖ వద్ద శాంతిని నెలకొల్పేందుకు, ఆర్థిక, దౌత్య మార్గాలను పునరుద్ధరించేందుకు భారత్ సుముఖత చూపింది.

ఈ ఘట్టం ఏ పరిణామాల్ని సూచిస్తోంది? చైనాతో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న శత్రుత్వ వాతావరణం మారనుందా? భారత్--చైనా సంబంధాల పునరుద్ధరణ అనేది దౌత్యపరమైన విజయానికంటే వ్యూహాత్మక రాజీని సూచిస్తోందా? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. రాజీ అనడం కన్నా ప్రస్తుత అల్లకల్లోల అంతర్జాతీయ వాతావరణంలో అదొక చారిత్రక అవసరం కూడా కావచ్చని మరికొందరు భావిస్తున్నారు. ఈ సమావేశంలో భారత్, చైనాల మధ్య అత్యంత ముఖ్యమైన ఏకాభిప్రాయం ఏర్పడిందని, వ్యూహాత్మక, దీర్ఘకాలిక, దిశానిర్దేశం చేసే అంశాలపై ఇరువురు నేతలు స్పష్టమైన, లోతైన చర్చలు జరిపారని చైనా విదేశాంగ మంత్రి, కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వాంగ్ యీ అనడం విస్మరించదగిన విషయం కాదు. బ్రిక్స్ సమావేశాలు మారుతున్న ప్రపంచ వ్యవస్థను, అంతర్జాతీయ సంబంధాల మార్పును సూచిస్తున్నాయని అమెరికన్ మీడియా వ్యాఖ్యానించింది. అమెరికాతో ఉద్రిక్తతలు ఉన్న ఇరాన్‌కు బ్రిక్స్‌లో ప్రముఖ స్థానం లభించడం గ్లోబల్ ఆర్డర్‌లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోందని అమెరికా పత్రికలు ప్రత్యేకంగా విశ్లేషించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సుంకాల విధానాలే అంతర్గతంగా గణనీయమైన భేదాభిప్రాయాలు ఉన్న దేశాలను ఒకచోటకు చేర్చే అనుసంధానంగా (బైండింగ్ ఏజెంట్) పనిచేశాయని అమెరికన్ మీడియా భావించింది. నిశితంగా విశ్లేషించాలంటే అమెరికాయే బ్రిక్స్‌కు సానుకూల పవనాలను (టెయిల్ విండ్) సృష్టించింది. వాషింగ్టన్ విధానాలు, అంతర్జాతీయ సంబంధాలు శాశ్వతంగా ఇలాగే ఉంటాయని చెప్పలేం. బహుళ ధ్రువ ప్రపంచంగా మారేందుకు, భద్రతా మండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు తీరుతెన్నుల్లో మార్పులు ఏర్పడేందుకు సమయం ఆసన్నమైందని, లేకపోతే బ్రిక్స్ మరింత బలమైన ప్రత్యామ్నాయ వ్యవస్థగా మారుతుందని చెప్పేందుకు ఆస్కారం ఏర్పడింది. దేశ రాజకీయాల్లో కూడా తమ వ్యవహారశైలే ప్రత్యర్థుల బలాబలాలను నిర్ణయిస్తుందని బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పాలక పక్షం నేతలు గ్రహించాల్సిన అవసరం ఉన్నది. ట్రంప్ ధాటితో పలు దేశాలు ఏకమైనట్లు గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రధానమంత్రి మోదీ, ఆయన కుడిభుజం అమిత్ షా ధాటికి తట్టుకోలేక ప్రత్యర్థి శక్తులన్నీ ఏకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి.

ఎడిటర్ చైతన్య

## భారత నౌకను ఢీకొట్టిన పాక్ నౌక

మొదటి పేజీ తరువాయి

అంతర్జాతీయ జలాల్లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. అరేబియా సముద్రంలో భారత నౌకను పాక్ నౌక ఢీకొట్టింది. దీనిని భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీంతో పాక్ దౌత్యవేత్తకు విదేశాంగ శాఖ సమన్లు జారీచేసింది.

గతేడాది పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్యపరంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో మంగళవారం సాయంత్రం భారత నౌకను పాక్ షిప్ ఢీకొట్టింది (ఘుఎ వాష్ట్రఅజూ-×అఎఖుఅ చీుజఎ ఖఅఈ). ఇది నిర్లక్ష్యపూరిత ప్రవర్తనగా భారత్ ఖండించింది. "సైనిక విన్యాసాలు, కసరత్తులు , దళాల కదలికలపై ముందస్తు నోటీసుకు సంబంధించి ఇరు దేశాల మధ్య 1991లో ఒప్పందం ఉంది. ఆ ఒప్పందంలోని ఆర్టికల్ 10ని పాక్ నౌక ఉల్లంఘించింది. అనైతిక పద్ధతిలో విన్యాసాలు చేయడమే ఈ పరిస్థితికి దారితీసింది" అని పేర్కొంది.

మసూద్‌ను పట్టించినవారికి రూ.70 లక్షలు: పాక్ ప్రకటన

అలాగే దిల్లీలోని పాకిస్థాన్ (ఘుఎఅర్ఘుఅ) అత్యున్నతస్థాయి దౌత్యప్రతినిధికి సమన్లు ఇచ్చింది. దౌత్యమార్గాల ద్వారా కేంద్రం ఈ ఘటనను లేవనెత్తింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని, ఇరుదేశాల మధ్య ఒప్పందాల్లోని నిబంధనలు గౌరవించేలా సంబంధిత పాక్ అధికారులకు తెలియజేయాలని సూచించింది. పాకిస్థాన్ విదేశాంగ శాఖ వద్ద ఈ ఘటనను లేవనెత్తాలని ఇస్లామాబాద్‌లోని భారత దౌత్యవేత్తకు వెల్లడించింది.

ఈ ఘటన జరిగిన సమయంలో అరేబియా జలాల్లో (ఘాతీుఎఖుఅ వాము) భారత నౌక గస్తీ నిర్వహిస్తోంది. భారత్‌వైపు ఎలాంటి నష్టం వాటిల్లలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. పాక్ నౌక హునైన్ క్లాస్‌కు చెందినదని, భారత్‌ది యుద్ధనౌక అని వెల్లడించాయి. ఆ సమయంలో సముద్రం అల్లకల్లోలంగా ఉందని, ఘటన తర్వాత రెండు నౌకలు దూరంగా వెళ్లాయని చెప్పాయి. కాగా.. 2011లో పాక్ నేవీకి చెందిన బాబర్, ఐఎన్ఎస్ గోదావరి మధ్య ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది.

## అసెంబ్లీలో సీఎం మాట్లాడినవన్నీ పచ్చి అబద్ధాలు:

మొదటి పేజీ తరువాయి

"కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు బయటపెడతామనే భయంతోనే మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. సభలో ప్రతిపక్షం లేకుండా, ప్రజా సమస్యలపై చర్చ లేకుండా తప్పించుకుంటున్నారు. 22ఏపై మేం చెప్పింది నిజమని.. ఇవాళ సీఎం ప్రసంగంతో తేలిపోయింది. 3లక్షల ఎకరాల సమస్య.. 30 లక్షల ఎకరాలకు పెరిగిపోయిందని సీఎం అన్నారు. 22ఏ పై గత కొంతకాలంగా బీఆర్ఎస్ చేస్తున్న పోరాటం అక్షర సత్యం.. ఇవాళ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న విషయం శాసనసభ సాక్షిగా తేటతెల్లమైంది. కలెక్టర్లు పాత జాబితా అప్‌లోడ్ చేశారు.. కలెక్టర్లు చూసుకోకుండా 30లక్షల ఎకరాలను 22ఏలో చేర్చారని సీఎం చెబితే.. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి మాత్రం ఒక్క ఎకరం కూడా చేర్చలేదని అన్నారు. 22ఏ నుంచి సీఎం ఇల్లును రాత్రికి రాత్రి ఎలా తీశారో.. ప్రజల భూములు కూడా అలాగే తీయాలి. ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారు.. బురదజల్లే ప్రయత్నం చేశారు. 22ఏ తప్పును సరిచేసుకోవాల్సిన పాలకులు విపక్షంపై ఎదురుదాడి చేస్తున్నారు. ప్రభుత్వం తప్పులను ఎత్తి చూపితే.. మాపై వ్యక్తిగతంగా ఎదురుదాడి చేస్తున్నారు. మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరాం.. దానిపై సమాధానం లేదు. ఎన్నికల అఫిడవిట్‌లో మేం చూపిన ఆస్తులే.. ఇప్పుడు సీఎం చెప్పారు.భూ భారతిలో రూ.80లక్షల విలువైన చలాన్ల స్కామ్ జరిగింది. ఒక్క జిల్లాలో రూ.80లక్షల చలాన్ల స్కామ్ జరిగితే .. ఎవరిపైనా చర్యలు లేవు. భూ భారతి ద్వారా ప్రజలకు తెలియకుండానే ప్రజల ఆస్తి.. మరొకరికి బదిలీ అయ్యింది. అసైన్డ్ భూములు పట్టా భూములుగా.. పట్టా భూములు అసైన్డ్ భూములుగా మారాయి. భూభారతి ద్వారా ఇప్పటికే 9,200కు పైగా అక్రమ లావాదేవీలు జరిగాయి" అని హరీశ్‌రావు ఆరోపించారు.

## సీఎం చెప్పిన భూముల చిట్టాపై నిజాలు నిగ్గు తేలాలి: కవిత

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: శాసనసభలో 22ఏ భూములపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పారని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత (ఖుజఙ్ఘు) విమర్శించారు. సిద్ధిపేట జిల్లాలో కవిత, ఆమె భర్త పేరు మీద 37.26 ఎకరాల భూమి ఉందని అసెంబ్లీలో సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటనపై 'ఎక్స్' వేదికగా కవిత స్పందించారు. "సీఎం ఈ రోజు అసెంబ్లీలో ప్రస్తావించిన నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి సహా అందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నా. నా కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్టు సీఎం చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు మించి ఒక్క గజం భూమి నాకు ఎక్కువగా ఉన్నా... ఎన్నికల అఫిడవిట్ లో పేర్కొన్న దానికన్నా గజం భూమి అదనంగా ఉన్నా... ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని మరోమారు స్పష్టం చేస్తున్నా" అని కవిత తెలిపారు.

## ఈనెల 19 నుంచి ఉమెన్ ఏపీఎల్: కేశినేని చిన్ని

మొదటి పేజీ తరువాయి

ఈ నెల 19 నుంచి 27 వరకు మంగళగిరి స్టేడియంలో ఉమెన్ ఏపీఎల్ పోటీలు జరగనున్నాయని చెప్పారు. మొత్తం నాలుగు టీమ్‌లు పాల్గొనే ఈ టోర్నమెంటును... డే అండ్ నైట్ విధానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. విజయవాడ ఏసీఏ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ఉమెన్ ఏపీఎల్ ప్రారంభోత్సవానికి నారా బ్రాహ్మణి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని చెప్పారు. ప్రేక్షకులు ఉచితంగా మ్యాచ్‌లు వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామని, విజయవాడ నుంచి విద్యార్థులను తీసుకువెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఉమెన్ ఏపీఎల్ ద్వారా మహిళా సాధికారతను ఘనంగా చాటబోతున్నామని చెప్పారు. ఈ సీజన్‌లో మంగళగిరి స్టేడియంలో మాత్రమే మ్యాచ్‌లు జరుగుతాయని, వచ్చే సీజన్ నుంచి విశాఖ, కడపలోనూ ఉమెన్ ఏపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించబోతున్నామని చెప్పారు.

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి



పటాన్‌చెరు: సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలోని వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడిపోయారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు.. గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతులను నరసింహ(21), తేజ(17), సిద్దార్థ(17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు.

# భూవివాదం..

మొదటి పేజీ తరువాయి

ఈ భూమిని 2011లో స్వయం బిల్డర్స్, సెవెన్ ఎలెవన్ కన్‌స్ట్రక్షన్స్ అనే రెండు సంస్థలు ఆక్రమించుకున్నాయని ఆయన ఆరోపించారు. ఈ రెండు సంస్థలతో భాజపా ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు సంబంధం ఉందని తెలిపారు. ఈ విషయం (వీశీఎఅ ఖీతీఅవఅఎ ఘుఅఎ ఐఅఅంజూబ్వ)పై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సైతం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

### రూ.3,300 కోట్ల ఎమ్మెల్యే బిచ్చగాడయ్యాడు

2015లో పోలీసులు దీనిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయగా.. దాదాపు 11ఏళ్ల తర్వాత ఇటీవల కోర్టుకు నివేదిక సమర్పించారు. మరోవైపు, ఈ వ్యవహారానికి సంబంధించి గతేడాది ఆ రెండు సంస్థలు.. వోహ్రాపై పోలీసులకు ఫిర్యాదు చేశాయి. దీంతో మనస్తాపానికి గురైన అస్గర్‌అలీ వోహ్రా.. సెప్టెంబరు 8న ప్రధాని మోదీని కలిసి తన ఆవేదనను విన్నవించుకున్నారు. ఈ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని అభ్యర్థించారు.

కాగా.. సెప్టెంబరు 16న ఈ కేసుపై మున్సిపల్ కార్పొరేషన్‌లో విచారణ జరగాల్సి ఉంది. ఆ లోగానే కేసు పరిష్కారమైనట్లు తెలిసింది. వోహ్రాతో భూవివాదం నుంచి ఆ రెండు సంస్థలు వెనక్కి తగ్గాయి. ఆయనకు భూమిని తిరిగిచ్చేందుకు అంగీకరించడంతో పాటు కేసును ఉపసంహరించుకున్నాయి. గుజరాత్‌లోని వాడ్‌నగర్‌లో గల బీఎన్ స్కూల్‌లో వోహ్రా చదువుకున్నారు. ఇదే పాఠశాలలో మోదీ కూడా విద్యనభ్యసించారు.

## కొందరు కొల్లగొట్టిన వేల ఎకరాల వివరాలు సభ ముందుంచుతా: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: 22ఏతో ప్రభుత్వం వేధిస్తోందని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారని.. అది నిజం కాదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో సీఎం మాట్లాడారు. ప్రతిపక్షాల ఆరోపణలు నిజం కాదని చెప్పేందుకే ఈ అంశంపై చర్చ చేపట్టామన్నారు. ప్రధాన సమస్యలపై చర్చ నుంచి తప్పించుకునేందుకే విపక్షం యత్నిస్తోందన్నారు. చర్చ జరిగితే 22ఏ విషయంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవకతవకలు బయటపడతాయని భావించే పక్కదోవ పట్టిస్తున్నారన్నారు.

"భూముల సమస్య వారసత్వంగా ఎలా వచ్చిందనే దానిపై చర్చ జరగాలి. నిజాం సర్కారు, ఉమ్మడి రాష్ట్రంలోని సమస్యలు, 22ఏ జాబితా సమస్యలు, కోర్టుల తీర్పులు వంటి అంశాలపై చర్చ చేపట్టాలి. కొందరు కొల్లగొట్టిన వేల ఎకరాల వివరాలను సభ ముందు ఉంచుతా. ధరణి పేరిట దోపిడీ జరిగి రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది. నిషేధిత భూముల సమస్యను మరింత జఠిలం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సృష్టించిన భూతం అందరినీ మింగేస్తుందని ఆయనపై కక్షాపూరిత ఆలోచనతో అబద్ధాలు ప్రచారం చేశారు. శ్రీనివాస్‌రెడ్డిది ఎంత బాధ్యతో ప్రభుత్వానిదీ అంతే బాధ్యత. ఈ సమస్యపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలి. సభ్యులు సూచన చేస్తే పేదలను ఆదుకునేందుకు మంచి నిర్ణయం తీసుకోవచ్చు. ప్రభుత్వ ప్రతిపాదిత అంశాలను పరిశీలించి సలహాలు సూచనలు ఇవ్వాలి" అని రేవంత్ కోరారు.

### ఆ నిబంధనలే అమలు చేస్తున్నాం

అసెంబ్లీ వద్ద పోలీసులు, మహిళలను కించపరిచేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరించారని సీఎం విమర్శించారు. అర్ధనగ్న ప్రదర్శనలతో పోలీసులను దూషించారని.. స్పీకర్‌ను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడారన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సభ్యులను సమావేశాల నుంచి స్పీకర్ బహిష్కరించారని చెప్పారు. సభ నిర్వహణపై గత ప్రభుత్వం కమిటీని నియమించి నిబంధనలు పెట్టిందన్నారు. సభలో ప్లకార్డులు, నినాదాలు ఉన్న ప్లెక్సీలు, దుస్తులతో రావొద్దని నిబంధనలు పెట్టారని... వాటినే అమలు చేయాలని అసెంబ్లీ సెక్రటరీ ద్వారా స్పీకర్ పోలీసులను ఆదేశించారని చెప్పారు. ఆ ఆదేశాలనే పోలీసులు అమలు చేస్తున్నారన్నారు.

## ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలు బయటకు తీయాలి:


మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటాలు ఎక్కడా జరగలేదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 1945 నుంచే కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ధరణిలో జరిగిన తప్పిదాలతో ప్రజలకు చాలా నష్టం జరిగిందన్నారు. 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూముల వివరాలను బయటకు తీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో కూనంనేని మాట్లాడారు.

హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలను వెల్లడించాలన్నారు. భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించే అంశాన్ని ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించారు. నిజాం హయాంలో సర్ఫ్‌ఖాన్ పేరిట హైదరాబాద్‌లో ఉన్న భూములు ఇప్పుడు ఎక్కడని ప్రశ్నించారు. వాటిని బయటకు తీస్తే స్థలం లేని అందరికీ ఇవ్వొచ్చన్నారు. 22ఏ విషయంలో జరిగింది సాంకేతిక తప్పిదంగా భావిస్తున్నట్లు తెలిపారు. దీనిలో మంత్రులు, అధికారుల పాత్ర ఎంత ఉందో తేల్చాలన్నారు.

## గురుకులాల పనివేళలపై వివరణివ్వండి: హైకోర్టు

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్: తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనివేళల మార్పుతోపాటు ఉపాధ్యాయులకు బోధనేతర విధులు అప్పగించడంపై వివరణివ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2024లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 16, అదేవిధంగా పనివేళలు మారుస్తూ ఈ ఏడాది జూన్‌లో జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో గురుకులాలను చేర్చాలని కోరుతూ ఎం.సిప్లీ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డిలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గురుకులాల పాఠశాలల పనివేళలు ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉన్నాయని, దీన్ని ఉదయం 9 నుంచి 4.30 వరకు ఉండేలా సవరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఉపాధ్యాయులకు స్టడీ అవర్, వార్డెన్, హాస్టల్ ఇన్‌ఛార్జి వంటి అదనపు విధులు అప్పగించరాదని ఆదేశించాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రభుత్వ వివరణ కోరుతూ విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక



# గుడివాడలో రూ.22.50 కోట్ల అమృత్ 2.0 పనులపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమీక్ష...

- ప్రజావేదిక కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, మెగా సంస్థ ప్రతినిధులతో సమావేశం...
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు ఎమ్మెల్యే స్పష్టీకరణ...
- ధనియాలపేట, ఆర్టీసీ కాలనీల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణ పనుల పురోగతిపై ఆరా....
- టిడ్కో,ఎన్టీఆర్ కాలనీ లేఅవుట్లలో... రూ.10 కోట్లతో ప్రత్యేక తాగునీటి ప్రాజెక్టులు
- ట్యాంకర్లతో కాదు....ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు అందిస్తున్నాం:ఎమ్మెల్యే రాము
- అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ వ్యవస్థ అభివృద్ధితో నీటి సరఫరా మెరుగు...





గుడివాడ పట్టణంలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అమృత్ 2.0 పథకంలో రూ.22.50 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, మెగా సంస్థ ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు.అమృత్ 2.0లో చేపట్టనున్న నీటి ప్రాజెక్టులతో పాటు ధనియాలపేట, ఆర్టీసీ కాలనీల్లో కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న తాగునీటి వాటర్ ట్యాంకుల పనుల పురోగతిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను అధికారులు, మెగా సంస్థ ప్రతినిధులు వివరించగా.. సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.సమస్యలను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని రాము తెలిపారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్ణీత సమయంలో వాటర్ ట్యాంకుల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. అమృత్ 2.0 పనులను అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, తమ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే రాము అన్నారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూపొందించిన ప్రణాళికలు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. గుడివాడలో అమృత్ 2.0 కింద రూ.22.50 కోట్లతో వాటర్ ప్రాజెక్టులు, అండర్ పైప్‌లైన్ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.టిడ్కో, ఎన్టీఆర్ కాలనీ లేఅవుట్లలో ప్రజలకు తాగునీరు అందించేందుకు రూ.10 కోట్లతో నీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. గతంలో వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేసే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ట్యాంకులతో అవసరం లేకుండా ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని తెలిపారు.గుడివాడ పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లోనూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులు చేపడుతున్నామని రాము పేర్కొన్నారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.సమావేశంలో మున్సిపల్ ఎం.ఈ సతీష్ చంద్ర,డి.ఈ శివాజీ,ఏ.ఈలీ రాజేష్, శ్రావణ్, శివాజీ, సత్యనారాయణ , మెగా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## "అచ్చమ్మకుంట తండా గ్రామంలో లో పశువైద్యశాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం": యం. ధారు నాయక్, రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు

పల్నాడు జిల్లా మాచర్ల మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన అచ్చమ్మకుంట తండాలో పశు వైద్యశాల ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అచ్చమ్మకుంట తండా ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. పశుసంపదనే అనేక కుటుంబాల ఆర్థిక జీవనానికి ప్రధాన ఆధారంగా ఉన్న నేపథ్యంలో, మారుమూల గిరిజన ప్రాంతంలోపశువైద్యశాల ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పశుపోషకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్అధ్యక్షులు యం. ధారు నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి ఆయనప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అచ్చమ్మకుంట తండా, పరిసర గ్రామాల్లో వేలాది పశువులు ఉండగా, అక్కడి గిరిజన, గిరిజనేతర కుటుంబాలకు పశు పోషణజీవనోపాధికి ప్రధాన ఆధారంగా



కొనసాగుతోంది. పశువుల సంరక్షణ, సకాలంలో వైద్యసేవలు అందించడం, పశు సంపదనుకాపాడుకోవడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని అచ్చమ్మకుంట తండాలో పశు వైద్యశాల ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంనిర్ణయించడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.కూటమి ప్రభుత్వ అధికారంలో వచ్చిన తర్వాత ప్రభుత్వం ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, సుస్థిరతమైన మరియుసమతుల్యమైన అభివృద్ధితో పాటు మరియు పశుసంక్షేమము పట్ల నిబద్ధతో కలిగి ఉండి, ఆంధ్రప్రదేశ్ విజన్ ఏ 2047లో భాగంగారాష్ట్ర ప్రభుత్వము సమగ్రమైన, పారదర్శకవంతమైన, సంక్షేమంతో కూడిన పాలనను ప్రజలకు అందిస్తుందని యం. ధారు నాయక్ తెలియజేశారు. ఈ సందర్భంగా పశు వైద్యశాల ఏర్పాటుకు దోహదపడినటువంటి జిల్లా మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ గారికి,నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ సభ్యులు శ్రీ లావు కృష్ణదేవరాయలు గారికి, మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీజూలకంటి బ్రహ్మారెడ్డి గారికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

# పేదల వెన్నంటే మెయిల్ క్రిష్ణారెడ్డి సేవలు...

మండలంలోని పేద కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) సంస్థ అధినేత పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల సేవలతో ఆర్థిక చేయూతను అందించి...వారి వారి రంగాల్లో ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు వారికి వెన్నంటే ఉంటున్నారని ఆ సంస్థ పీ4 ప్రాజెక్ట్ మేనేజర్ బి.చింతయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.రఘురామ్ పేర్కొన్నారు. పీ4(పబ్లిక్-- ప్రైవేట్ -- పీపుల్ -- పార్టనర్‌షిప్) ప్రాజెక్టులో భాగంగా క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆర్థికసాయంతో మండలంలోని వడ్లమన్నాడుకు చెందిన పురమా దుర్గకు రూ.37వేలతో జీవనోపాధిగా హోటల్ యూనిట్‌ను ఏపీఎంఏఎస్ ద్వారా అందజేశారు. అలాగే అదే గ్రామానికి




చెందిన దత్తాడ లీలా శివప్రసాద్‌కు రూ.49వేల విలువైన జిరాక్స్ మిషన్, జనరల్ స్టోర్ యూనిట్‌ను అందించారు. అలాగే శేరీ దగ్గుమిల్లికి చెందిన బుద్దుల నాగలక్ష్మికి గొర్రెల పెంపెకం యూనిట్ నిమిత్తం రూ.62,832ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు పెన్నేరు రమేష్ బాబు, మాజీ ఉప సర్పంచి గరికిపాటి రాంబాబు, టీడీపీ గ్రామాధ్యక్షుడు పామర్తి సత్తిబాబు, వ్యాపార వేత్త తోట



ప్రసన్నాంజనేయులు, మహిళా పోలీస్ రాజ్యలక్ష్మి, బంగారు మిత్ర పుల్లేటి సాయి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. మెయిల్ సంస్థ అందిస్తున్న జీవనోపాధి సహకారంతో అర్హులైన కుటుంబాలు స్వయం ఉపాధి ద్వారా ఆదాయాన్ని పెంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం కలుగుతోందని కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు తెలిపారు. పేద కుటుంబాలకు మెయిల్ క్రిష్ణారెడ్డి ఈ సేవలను అందించి ఆయా కుటుంబాలకు కొత్త జీవితాలను ప్రసాదిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

# రాజకీయ నేతలతో పోలింగ్ కేంద్రాలపై సమావేశం...

మండలంలో జెడ్పీటీసీ/ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా పోలింగ్ కేంద్రాలపై సమావేశాన్ని బుధవారం మండలంలోని వివిధ పార్టీల రాజకీయ నాయకులతో ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు మరియు నిబంధనల మేరకు రూపొందించిన ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను సమావేశంలో పరిశీలించడం జరిగిందని, సంబంధిత అధికారులు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించడం జరిగిందని తెలిపారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే ఎన్నికల నిబంధనల



ప్రకారం నిర్ణీత గడువులోగా తెలియజేయాలని ఎంపీడీఓ ఇమ్రాన్ సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ కోటప్రోలు నాగు, ఆ పార్టీ గుడ్లవల్లేరు మండల యువజనాధ్యక్షుడు గుదే రవి టీడీపీ గుడ్లవల్లేరు అధ్యక్షుడు వల్లభనేని రంగబాబు, టీడీపీ నాయకుడు చిట్టి బొమ్మ వీరాజు, జనసేన నేతలు తోట చిన్నారి, అడపా బాబి, ఈ.ఓ.పి.ఆర్.డి. జి.ఎస్.ఎస్.అంజనాదేవి పాల్గొన్నారు.

# వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి



### మాచవరం పీహెచ్‌సీ ఎదుట బంధువుల ఆందోళన

పల్నాడు జిల్లా మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ నవజాత శిశువు ప్రాణాలు కోల్పోయిందంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పిన్నెల్లి గ్రామానికి చెందిన కొమ్ము మహిమకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే మాచవరం ఆసుపత్రికి తరలించారు. అయితే ఆ సమయంలో ఆసుపత్రిలో డ్యూటీ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో, అక్కడే ఉన్న ఆయానే ప్రసవం చేసిందని వారు తెలిపారు. పుట్టిన కొద్దిసేపటికే మగ శిశువు మృతి చెందడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల పర్యవేక్షణ లోపించడం వల్లే పసికందు కన్నుమూశాడని బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ఉరుములు ,పిడుగులతో కురిసిన వర్షానికి, పిడుగుల శబ్ద భయానికి...ఆగిన గుండెలు..

- పల్నాడు జిల్లా లో వేరు వేరు గ్రామాల్లో ఇద్దరు మృతి

పల్నాడు జిల్లాలో పిడుగుల ధాటికి ఇద్దరు వృద్ధ మహిళలు మృతి చెందిన విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. నరసరావుపేట మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ఈ దుర్ఘటనలు జరిగాయి. వివరాల్లోకి వెళితే.. శనివారం రాత్రి నరసరావుపేట పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన తల్లపనేని నాగమ్మ (63) పిడుగుపాటుకు సంభవించిన భారీ శబ్దానికి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఆ వెంటనే ఆమె గుండెపోటుతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందారు.

అలాగే సమీపంలోని లక్ష్మీపురం గ్రామంలో మేకల వెంకాయమ్మ (60) కూడా పిడుగుల గర్జనకు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీంతో ఆమెకు గుండెపోటు రావడంతో ప్రాణాలు విడిచారు. పిడుగుల ధాటికి వెలువడిన భారీ శబ్దాల కారణంగానే తమ వారు మరణించారని మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.



# ఈ నెల 21న నియోజకవర్గ స్థాయి ప్రజా దర్బార్..!

- రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమీక్ష

ఈనెల 21, సోమవారం నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ ను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మీడియాకు తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు రెవెన్యూ మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నెహ్రూనగర్ బోటు మీద ఉన్న వి.వి.ఎన్ గార్డెన్స్ నందు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, తదితర అన్ని శాఖల జిల్లా, నియోజకవర్గ స్థాయి ఉన్నతాధికారులు ప్రజా గ్రీవెన్స్ లో పాల్గొంటారని, అందుకు తగినట్లు అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. పెండింగ్ ఉన్న రెవెన్యూ, ఇతర సమస్యలను అర్జీల రూపంలో అందించి, పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఈ సమావేశంలో మండల తహశీల్దార్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, హోసింగ్ ఏఈ మరియదాసు తదితరులు పాల్గొన్నారు.



# చివరి రోజున మహా అన్నదాన కార్యక్రమం : గణేష్ ఉత్సవ కమిటీ

పల్నాడు జిల్లా కారంపూడి పట్టణంలోని ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్లో టూ టౌన్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద బుధవారం కోలాట ప్రదర్శన నిర్వహించారు. గత 18 సంవత్సరాలుగా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారని కమిటీ వారు తెలిపారు. కోలాట ప్రదర్శన అందర్నీ ఆకర్షించింది. రానున్న మూడు రోజులు మరిన్ని ప్రదర్శనలు ఉంటాయని, చివర రోజున మహా అన్నదానం కార్యక్రమం ఉంటుందని కమిటీ వారు తెలియజేశారు.



## సీనియర్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ లో విద్యార్థునుల ప్రతిభ

విజయపురిసౌత్:ఈ నెల 12 నుంచి 13 వరకు పిఠాపురం లోని మూలపేట గ్రామంలో రాష్ట్ర స్థాయి లో జరిగిన అసోసియేషన్ సీనియర్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ గేమ్ పోటీల్లో స్థానిక డా.బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు.రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుని సత్తా చాటారు.ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థునులు పాల్గొని ట్రోఫీని దక్కించుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ వాణి రాణి అభినందించారు.ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో విద్యార్థినులు సత్తా చాటి అంబేద్కర్ గురుకుల పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం గర్వనీయం అన్నారు.






జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక



# రోజూ వ్యాయామం చేయడం ఆరోగ్యానికి మంచిదేనా?




ఆరోగ్యంగా, ఉత్సాహంగా జీవించాలంటే రోజూ వ్యాయామం చేయడం ఎంతో అవసరం. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండటానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

నేటి బిజీ జీవితంలో ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యం. అందుకు రోజూ వ్యాయామం చేయడం మంచి అలవాటు. ఇది శరీరాన్ని దృఢంగా ఉంచడమే కాకుండా, మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. అందుకే.. రోజూ కనీసం కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ఆనందంగా ఉండేలా చేస్తుంది**

వ్యాయామం చేయడం వల్ల శరీరంలో సంతోషాన్ని కలిగించే హార్మోన్లు విడుదలవుతాయి. దీంతో మనసు ప్రశాంతంగా ఉండి, ఉత్సాహం పెరుగుతుంది.

**బరువును నియంత్రిస్తుంది**

రోజూ వ్యాయామం చేస్తే శరీరంలో ఉన్న అదనపు కేలరీలు ఖర్చవుతాయి. దీంతో బరువు నియంత్రణలో ఉండటమే కాకుండా, స్థూలకాయం సమస్య కూడా తగ్గుతుంది.

**వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది**

క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల గుండె జబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. అలాగే కొన్ని రకాల క్యాన్సర్ల నుంచి కూడా రక్షణ లభిస్తుంది.

**మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది**

ఒత్తిడి, ఆందోళనతో బాధపడుతున్నవారికి వ్యాయామం మంచి పరిష్కారం. రోజూ అరగంట నడక కూడా మనసుకు ప్రశాంతతను అందిస్తుంది.

**శక్తిని పెంచుతుంది**

వ్యాయామం కండరాలను బలపరచి శరీరానికి కావాల్సిన శక్తిని పెంచుతుంది. దీంతో రోజంతా చురుకుగా ఉండగలుగుతారు.

**నిద్రను మెరుగుపరుస్తుంది**

నిద్రలేమి సమస్యతో బాధపడేవారికి వ్యాయామం ఎంతో ఉపయోగకరం. ఇది త్వరగా నిద్రపోవడానికి సహాయపడుతుంది.

**సానుకూల ఆలోచనలను పెంచుతుంది**

రోజూ వ్యాయామం చేయడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా శక్తి మెరుగుపడి సానుకూల దృక్పథం పెరుగుతుంది.

రోజూ కొద్దిసేపు వ్యాయామం చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలికి వ్యాయామం ఒక ముఖ్యమైన భాగం. కాబట్టి రోజువారీ జీవితంలో వ్యాయామాన్ని తప్పనిసరిగా భాగం చేసుకోవడం మంచిది.

## రోజూ 5 నిమిషాలు.. ఈ వ్యాయామం చేస్తే ఫిట్‌గా ఉండొచ్చు!

**జంపింగ్ జాక్స్**

మొదట 45 సెకన్ల పాటు జంపింగ్ జాక్స్ చేయాలి. ఇది శరీరాన్ని వార్మప్ చేయడంలో సహాయపడుతుంది. గుండె, ఊపిరితిత్తులు, కండరాలు చురుకుగా పనిచేసేలా చేస్తుంది. శరీరమంతా కదలికలోకి రావడానికి ఇది మంచి వ్యాయామం.

**స్క్వాట్స్**

తర్వాత 45 సెకన్ల పాటు స్క్వాట్స్ చేయాలి. ఇవి తొడలు, తుంటి కండరాలను బలపరుస్తాయి. అలాగే పొట్ట, నడుము భాగంలోని కండరాల శక్తిని పెంచుతాయి. శరీర సమతుల్యత, సహనాన్ని మెరుగుపరుస్తాయి.

**పుష్-అప్స్**

45 సెకన్ల పాటు పుష్-అప్స్ చేయాలి. ఇవి ఛాతీ, భుజాలు, చేతులు, కోర్ కండరాలను బలపరుస్తాయి. శరీర బరువునే ఉపయోగించి చేసే ఈ వ్యాయామం కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది.

**మౌంటైన్ క్లైంబర్స్**

పొట్ట కొవ్వు తగ్గించడంలో, శరీరాన్ని చురుకుగా ఉంచడంలో మౌంటెన్ క్లైంబర్స్ ఉపయోగపడతాయి. 45 సెకన్ల పాటు ఈ



వ్యాయామం చేస్తే గుండె వేగం పెరిగి క్యాలరీలు ఎక్కువగా ఖర్చవుతాయి.

**ప్లాంక్**

చివరిగా 45 సెకన్ల పాటు ప్లాంక్ చేయాలి. ఇది పొట్ట, నడుము, భుజాల కండరాలను బలపరుస్తుంది. శరీర స్థిరత్వాన్ని పెంచి, సరైన భంగిమను కాపాడటానికి సహాయపడుతుంది.

**ప్రయోజనాలు**

కేవలం 5 నిమిషాల పాటు ఈ వ్యాయామాలు చేసినా శరీరంలోని ప్రధాన కండర సమూహాలు చురుకుగా పనిచేస్తాయి. రోజువారీ శక్తి స్థాయిలు పెరుగుతాయి. శారీరక దృఢత్వం మెరుగుపడి, ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుంది. కాబట్టి సమయం తక్కువగా ఉన్నవారు కూడా రోజూ ఈ 5 నిమిషాల వ్యాయామాన్ని అలవాటు చేసుకోవచ్చు.

# వ్యాయామానికి ముందు వార్మప్ తప్పనిసరి.. ఎందుకంటే!




ఇంటర్నెట్ డెస్క్: ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. అయితే చాలా మంది వ్యాయామం చేసే ముందు వార్మప్‌చేయడాన్ని నిర్లక్ష్యం చేస్తారు. కాని వ్యాయామానికి ముందు శరీరాన్ని వార్మప్ చేయడం వల్ల శరీరం వ్యాయామానికి సిద్ధమవుతుంది. దీంతో వ్యాయామ ఫలితాలు మెరుగుపడతాయని నిపుణులు చెబుతున్నారు.

## వార్మప్ అంటే ఏమిటీ?

- వార్మప్ అనేది వ్యాయామానికి ముందు చేసే తేలికపాటి శారీరక కదలికలు లేదా స్ట్రెచింగ్ వ్యాయామాలు. సాధారణంగా 5 నుంచి 10 నిమిషాల పాటు జాగింగ్, జంపింగ్ జాక్స్, ఆర్మ్ స్వింగ్స్, స్ట్రెచింగ్ వంటి వ్యాయామాలు చేయడం ద్వారా శరీరాన్ని వ్యాయామానికి సిద్ధం చేస్తారు.

5 - 10 నిమిషాలు

## వార్మప్ ఎందుకు చేయాలి?

ఎలా అయితే వాహనాన్ని స్టార్ట్ చేసిన వెంటనే వేగంగా నడపకుండా కొంతసేపు ఇంజిన్‌ను వేడెక్కిస్తామో, అలాగే వ్యాయామానికి ముందు కూడా శరీరాన్ని క్రమంగా సిద్ధం చేయాలి. వార్మప్ చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది, కండరాలకు రక్తప్రసరణ మెరుగుపుతుంది. దీంతో శరీరం వ్యాయామాన్ని సులభంగా తట్టుకోగలుగుతుంది.



## వార్మప్ చేయకుండా వ్యాయామం చేస్తే ఏమివుతుంది?

వార్మప్ లేకుండా నేరుగా కఠినమైన వ్యాయామాలు చేస్తే కండరాలపై ఒక్కసారిగా ఒత్తిడి పడుతుంది. దీంతో కండరాల నొప్పులు, కండరాలు పట్టేయడం, గాయాలు అయ్యే ప్రమాదం పెరుగుతుంది. అందుకే వ్యాయామానికి ముందు తప్పనిసరిగా వార్మప్ చేయాలని ఫిట్‌నెస్ నిపుణులు సూచిస్తున్నారు.



## వార్మప్ వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు

- శరీరం ముందుగానే సిద్ధమపడంతో వ్యాయామాన్ని ఎక్కువసేపు, మరింత సమర్థవంతంగా చేయగలుగుతారు.
- కండరాలు, కీళ్లు మరింత చురుకుగా మారి కదలికలు సులభమవుతాయి.
- వార్మప్ శరీరాన్నే కాదు, మనసును కూడా వ్యాయామానికి సిద్ధం చేస్తుంది. దీంతో దృష్టి కేంద్రీకరణ పెరిగి మెరుగైన ఫలితాలు పొందవచ్చు.

## వార్మప్ ఉదాహరణలు




**వ్యాయామం ఎంత ముఖ్యమో, దానికి ముందు వార్మప్ చేయడం కూడా అంతే ముఖ్యం.**

కేవలం 5 నుంచి 10 నిమిషాలు వార్మప్ చేయడం ద్వారా గాయాల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చడంతో పాటు వ్యాయామం నుంచి మరింత మంచి ఫలితాలు పొందవచ్చు. కాబట్టి ప్రతి వ్యాయామానికి ముందు వార్మప్‌ను అలవాటుగా మార్చుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

Fit Body Healthy Life

# ఆగస్టులో ఎగుమతుల జోరు

## 5 నెలల కనిష్టానికి వాణిజ్య లోటు



### వస్తు ఎగుమతులు

ఆగస్టులో దేశ వస్తు ఎగుమతులు **26.12%** పెరిగి **$43.81 బిలియన్** (రూ.4.16 లక్షల కోట్లు)కు చేరాయి.

పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు ఇందుకు నిండగా నిలిచాయి.

2022 జూన్ తర్వాత (30.12% వృద్ధి) ఒక నెలలో ఎగుమతులు ఈ స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి.

### దిగుమతుల వివరాలు

ఆగస్టులో దిగుమతులు **1.41%** పెరిగి **$70.76 బిలియన్** నమోదయ్యాయి.

పసిడి దిగుమతులు తగ్గడంతో.. వాణిజ్య లోటు 5 నెలల కనిష్టమైన **$26.86 బిలియన్** (రూ.2.55 లక్షల కోట్లు)కు తగ్గింది.

### పసిడి దిగుమతుల్లో క్షీణత

2025 ఆగస్టులో **$5.4 బిలియన్** ఉన్న పసిడి దిగుమతులు, గత నెలతో పోలిస్తే **57.7%** తగ్గి **$2.3 బిలియన్** కు పరిమితమయ్యాయి.

### ఏప్రిల్ – ఆగస్టు (2025)లో పరిస్థితి

ఎగుమతులు **17.85%** పెరిగి **$215.91 బిలియన్**

దిగుమతులు **18.21%** పెరిగి **$363 బిలియన్**

వాణిజ్య లోటు **$123.88** బిలియన్ నుండి **$147.09** బిలియన్‌కు పెరిగింది.

### ఎగుమతుల వృద్ధికి ప్రధాన కారణాలు

- ఇంజనీరింగ్ వస్తువులు
- పెట్రోలియం ఉత్పత్తులు
- రసాయనాలు
- జౌళి రంగాలు



### కరెంట్ ఖాతా లోటు (CAD)

ప్రధానంగా వస్తు వాణిజ్య లోటు పెరగడం వల్ల మన దేశ కరెంట్ ఖాతా లోటు (CAD) 2025 జూలైలో ఉన్న **3.2** బిలియన్ డాలర్ల నుండి, **2026** జూలైలో **7 బిలియన్** డాలర్లకు పెరిగిందని ఆర్‌బీఐ తెలిపింది.



# యూఎస్ ఫెడ్ మీటింగ్ వేళ..

# లాభాల్లో ముగిసిన సూచీలు


దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి . యూఎస్ ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశ ఫలితాలకు ముందు చమురు ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం.. మార్కెట్‌కు కలిసొచ్చింది. ముఖ్యంగా ఎఫ్‌ఎంసీజీ, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు రాణించడంతో రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది.

సెన్సెక్స్ ఉదయం 74,249.31 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,003.82) లాభాల్లో ప్రారంభమైంది. రోజులో చాలా వరకు లాభాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 74,505.86 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 332.63 పాయింట్ల లాభంతో 74,336.45 వద్ద ముగిసింది. నిఫ్టీ 99 పాయింట్లు పెరిగి 23,217.60 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.95గా ఉంది.

కేంద్ర క్యాబినెట్ గుడ్‌న్యూస్.. జూఖీ వేతన పరిమితి పెంపు

సెన్సెక్స్ 30లో ఐటీసీ, ఎస్‌బీఐ, యాక్సిస్‌బ్యాంక్, ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, బజాజ్‌ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ, ఎల్‌అండ్‌టీ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 107.73 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,342.99 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# యూపీఐ ఎండీఆర్‌పై 18 శాతం జీఎస్టీ



దిల్లీ: యూపీఐ లావాదేవీలకు సంబంధించి పెద్ద వ్యాపారులకు ఎండీఆర్‌తో పాటు మరో భారం కూడా పడనుంది. రూ.2,000కు మించి జరిపే యూపీఐ చెల్లింపులపై వర్తించే మర్చంట్ డిస్కౌంట్ రేటుపై వ్యాపారులు 18 శాతం జీఎస్టీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. అయితే వారు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను పొందడం ద్వారా మొత్తం పన్ను భారాన్ని తగ్గించుకోవచ్చని పన్ను నిపుణులు చెబుతున్నారు.

వ్యక్తులు రూ.2వేలు పైబడి వ్యాపారులకు చేసే యూపీఐ చెల్లింపులపై అక్టోబర్ 15 నుంచి 0.4 శాతం ఎండీఆర్ అమల్లోకి రానుంది. గరిష్ఠ పరిమితిని రూ.300గా కేంద్రం నిర్ణయించింది. రైల్వే, టెలికాం, బీమా, పెట్రోల్ బంకుల్లో ఫ్లాట్ రేటు రూ.5గా నిర్ణయించారు. ప్రతిపాదిత విధానం ప్రకారం చెల్లింపు సేవలు వినియోగించుకున్నందుకు గానూ ఎండీఆర్ భారాన్ని వ్యాపారులే భరించాల్సి ఉంటుంది. దీనికి 18 శాతం జీఎస్టీ కూడా వర్తిస్తుందని పన్ను నిపుణులు చెబుతున్నారు.

ఎండీఆర్‌పై 18 శాతం జీఎస్టీ విధించడం వల్ల ఏటా రూ.3,500 నుంచి రూ.4వేల కోట్ల ఆదాయం సమకూరనుందని ఏఎంఆర్‌జీ గ్లోబల్ మేనేజింగ్ పార్ట్‌నర్ రజత్ మోహన్ వెల్లడించారు. అయితే, ఈ రుసుములను భరించే నమోదిత వ్యాపారులు చెల్లించిన జీఎస్టీపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను క్లెయిమ్ చేసుకోవడం ద్వారా పన్ను భారం తగ్గించుకోవచ్చని చెప్పారు. లావాదేవీ విలువతో సంబంధం లేకుండా 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటుపై మాత్రమే 18 శాతం జీఎస్టీ వర్తిస్తుందని మరో పన్ను నిపుణుడు శివకుమార్ రమ్జీ తెలిపారు. జీఎస్టీ పరిధిలో ఉన్న వారు ఐటీసీ ద్వారా మినహాయింపు ఈ భారం తగ్గించుకోవచ్చని, జీఎస్టీ వెలుపల ఉన్న వ్యాపారులు మాత్రం ఎండీఆర్ ఛార్జీలతో పాటు దానిపై జీఎస్టీ భారమూ భరించాల్సి ఉంటుందని తెలిపారు.

యూపీఐపై ఛార్జీల విషయంలో కేంద్రం వెనక్కి తగ్గే ఉద్దేశమేదీ లేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక పునరాలోచన చేసే అవకాశమే లేదని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు స్పష్టంచేశారు. యూపీఐని మరింత బలోపేతం చేసే ఉద్దేశంతోనే ఎండీఆర్ ఛార్జీల విధానాన్ని కేంద్రం తీసుకొచ్చిందని తెలిపారు. ఎండీఆర్ ఛార్జీలపై విపక్ష పార్టీలు, ట్రేడర్ల నుంచి వ్యతిరేకత వస్తున్న వేళ ప్రభుత్వం నుంచి ఈ స్పందన వెలువడింది.

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
గురువారం సెప్టెంబర్ 17,2026

# న్యూ ఏజ్ మ్యూజికల్ ఫిల్మ్‌గా 'పాటకు ప్రాణం'.. ఘనంగా ప్రారంభోత్సవం

**జన తెలంగాణ సినిమా**

హెచ్.టీ సినిమాస్ ఎల్.ఎల్.పి బ్యానర్‌పై హేమల్ తుమ్మపూడి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కనున్న తొలి చిత్రం 'పాటకు ప్రాణం' హైదరాబాద్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు సురేందర్ రెడ్డి, ప్రముఖ హీరో నిఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. సంగీతానికి, భావోద్వేగాలకు ప్రాధాన్యతనిస్తూ తెరకెక్కనున్న ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్నారు. ఈ మ్యూజికల్ ఫిల్మ్‌లో యువ నటులు సుదర్శన్, సాత్విక జంటగా నటిస్తున్నారు. సీనియర్ నటుడు తనికెళ్ల భరణి కీలక పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు రాజీవ్ కనకాల, అనితా చౌదరి, రఘు కారుమంచి, బ్రహ్మాజీ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానుందని దర్శక నిర్మాత హేమల్ తుమ్మపూడి తెలిపారు. వైవిధ్యమైన కథాంశంతో, సంగీతానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమంలో, దర్శకుడు హేమల్ తుమ్మపూడి మాట్లాడుతూ , "ముందుగా మా లాంటి యువ ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇక్కడికి విచ్చేసిన మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. అలాగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన హీరో నిఖిల్ గారికి, దర్శకుడు సురేందర్ రెడ్డి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. మా చిత్రబృందాన్ని ఆశీర్వదించేందుకు వచ్చిన నటీనటులందరికీ ధన్యవాదాలు. ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో తనికెళ్ల భరణి గారు, సుధర్శన్ గారు నటిస్తున్నారు. వీరితో పాటు రాజీవ్ కనకాల గారు, అనితా చౌదరి గారు, రఘు కారుమంచి గారు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సుమారు 60 ఏళ్లుగా వెనుకబడిపోయిన రామయ్య అనే వ్యక్తి, అలాగే 20 ఏళ్ల యువకుడు కలిసి ప్రారంభించే మ్యూజికల్ జర్నీ చుట్టూ మా సినిమా కథ సాగుతుంది. ఇది న్యూ ఏజ్ మ్యూజికల్ డ్రామా. సినిమాలో చాలా పాటలు ఉంటాయి. మా చిత్రానికి శేఖర్ చంద్ర అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది ద్వితీయార్థంలో మంచి తేదీని చూసుకుని థియేటర్లలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. మా ఈ ప్రయాణంలో ముందుకు సాగేందుకు మీడియా, ప్రేక్షకుల నుంచి ఇదే విధమైన సహకారం, ఆశీర్వాదాలు కొనసాగాలని కోరుకుంటున్నాను". తనికెళ్ల భరణి గారు మాట్లాడుతూ ,""ఈ సినిమాపై ఎంతో ప్యాషన్‌తో, నమ్మకంతో పనిచేస్తున్న ఈ యువ దర్శకుడి కాన్ఫిడెన్స్ మీకు కూడా కనిపిస్తుందని అనుకుంటున్నాను. ఆయన ఎన్నారై అయినప్పటికీ, సినిమా చేయాలనే తపనతో ఈ ప్రాజెక్ట్‌ను చాలా అంకితభావంతో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు చాలా ఛాలెంజింగ్ స్క్రిప్ట్ ఉంది. ముఖ్యంగా పాటలకు చాలా ప్రాధాన్యత ఉంది. సాధారణంగా సినిమాలో కథకు తగ్గట్టుగా పాటలు వస్తుంటాయి. కానీ ఈ సినిమాలో మాత్రం కథే పాటల చుట్టూ తిరుగుతుంది. గతంలో ఇలాంటి నేపథ్యంతో వచ్చిన సినిమా 'శంకరాభరణం'. 'పాటకు ప్రాణం' సినిమాను 'శంకరాభరణం'తో పోల్చడం లేదు. అయితే ఆ సినిమాలో ఉన్న సంగీత స్ఫూర్తి ఈ సినిమాలో కూడా కనిపిస్తుంది. ఈ చిత్రంలో ఒక పాత తరం సంప్రదాయ సంగీత విద్వాంసుడికి, ఈ తరం జెన్‌-గ సంగీతకారుడికి మధ్య ఉండే ఆసక్తికరమైన



కలయికను చూపించబోతున్నారు. ఈ సినిమా దర్శకుడిపై నాకు పూర్తి నమ్మకం ఉంది. ఇలాంటి మంచి కథలు, సినిమాలు రాబోయే తరాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తాయని ఆశిస్తున్నాను."రాజీవ్ కనకాల గారు మాట్లాడుతూ ,""భరణి గారు ఈ సినిమా గురించి చాలా చక్కగా వివరించారు. జెన్-జెడ్ ప్రేక్షకుల కోసం ఇలాంటి సినిమా తీసుకొస్తున్న దర్శకుడు హేమల్‌కు ముందుగా అభినందనలు. సినిమా విడుదలైన తర్వాత ఈ మ్యూజికల్ జర్నీ అందరినీ తప్పకుండా అలరిస్తుందని, స్ఫూర్తినిస్తుందని నమ్ముతున్నాను. ఇక నా పాత్ర విషయానికి వస్తే.. 'లిటిల్ హార్ట్స్' హిట్ సినిమా తర్వాత అనితా చౌదరి గారితో మరోసారి కలిసి నటిస్తున్నాను. మంచి స్క్రిప్ట్ కుదిరితే ఈ సినిమాతో కూడా మా హిట్ కాంబినేషన్ కొనసాగుతుందని ఆశిస్తున్నాను. సుధర్శన్, దర్శకుడు హేమల్‌కు, అలాగే అందమైన హీరోయిన్ సాత్వికకు మంచి విజయం దక్కాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా మంచి విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అందరూ మమ్మల్ని ఆదరించి, ఈ సినిమాకు మీ సహకారం అందించాలని కోరుతున్నాను."అనితా చౌదరి గారు మాట్లాడుతూ ,""ఈ యువ దర్శకుడు హేమల్‌తో కలిసి పనిచేయడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాకు సంబంధించి హేమల్ నాకు ఫోన్‌లో కథ చెప్పినప్పుడే ఆయనలో ఉన్న అదే ఎనర్జీ, అదే నమ్మకం నాకు కనిపించింది. ప్రతిసారీ ఆయనతో మాట్లాడటం, ఈ సినిమా గురించి తెలుసుకోవడం చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. తనికెళ్ల భరణి గారితో, రాజీవ్ కనకాల గారితో మరోసారి కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. అలాగే ఈ సినిమాలో సుధర్శన్ తల్లిగా నటించే అవకాశం ఇచ్చినందుకు చాలా ధన్యవాదాలు. మమ్మల్ని, ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరినీ మీ అందరూ ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను."హీరో సుధర్శన్ వంగల మాట్లాడుతూ ,""మా కార్యక్రమానికి విచ్చేసి మమ్మల్ని ఆశీర్వదించిన మీడియా మిత్రులందరికీ, ముఖ్య అతిథులుగా వచ్చిన నిఖిల్ గారికి, సురేందర్ రెడ్డి గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమాలో నేను అరుణ్ అనే పాత్రలో నటిస్తున్నాను. ఇంతమంది ప్రతిభావంతులైన నటీనటులతో కలిసి ఈ సినిమాలో భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మా దర్శకుడు హేమల్ చాలా చిన్న వయసులోనే ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇలాంటి మ్యూజికల్ సినిమాలు చాలా అరుదుగా వస్తుంటాయి. అందుకే మా సినిమాను ప్రేక్షకులు ఆదరించి, మాకు అండగా నిలవాలని కోరుకుంటున్నాను. ప్రేక్షకులు థియేటర్లలో ఒక అద్భుతమైన అనుభూతిని పొందేలా మంచి సినిమాను అందించగలమనే నమ్మకం మాకు ఉంది. మా సినిమాకు మీ అందరి ఆశీస్సులు, సహకారం ఎప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను." హీరోయిన్ సాత్విక మాట్లాడుతూ ,""మా సినిమాకు మద్దతుగా వచ్చి ప్రోత్సహిస్తున్న మీడియా మిత్రులందరికీ, ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సినిమాలో నేను రాధ పాత్రలో నటిస్తున్నాను. అరుణ్ జీవిత ప్రయాణంలో రాధ పాత్ర కూడా ఒక ముఖ్యమైన భాగంగా ఉంటుంది. ఇంతమంది ప్రతిభావంతులైన నటీనటులు, టెక్నీషియన్స్‌తో కలిసి పనిచేయడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమా కోసం ఎంతో ఎగ్జైటింగ్‌గా ఎదురుచూస్తున్నాను. సినిమా మంచి విజయం సాధించాలని ఆశిస్తున్నాను."నిర్మాత శ్రీరామ్ తుమ్మపూడి గారు మాట్లాడుతూ ,"మా కార్యక్రమానికి సమయం కేటాయించి విచ్చేసిన ముఖ్య అతిథులు నిఖిల్ గారికి, సురేందర్ రెడ్డి గారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. ఈ సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు. ముఖ్యంగా రాజీవ్ కనకాల గారు, తనికెళ్ల భరణి గారు, అనితా చౌదరి గారు అందించిన సహకారానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. మా సినిమాకు మీ అందరి సహకారం, ఆశీస్సులు ఎప్పటికీ ఉండాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాను ఆదరించి మమ్మల్ని ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాను."డీఓపీ సంజీత్ సింగ్ మాట్లాడుతూ, """అందరికీ నమస్కారం. 'పాటకు ప్రాణం' సినిమాలో పనిచేసే అవకాశం ఇచ్చిన దర్శకుడు హేమల్ గారికి ముందుగా నా ధన్యవాదాలు. హేమల్ గారికి సినిమా క్రాఫ్ట్‌పై మంచి పట్టు ఉంది. ప్రతి షాట్‌కు ఉన్న ప్రాధాన్యతను ఆయన అర్థం చేసుకుంటారు. కథకు ఏది అవసరమో, ఏది అవసరం లేదో తెలుసుకుని, సినిమాను చాలా ఎఫిషియెంట్‌గా తెరకెక్కిస్తున్నారు. ముఖ్యంగా పాటలను చిత్రీకరించే విషయంలో కూడా చాలా ఆసక్తికరమైన విషయాలను చూపించబోతున్నాం. ఈ అద్భుతమైన నటీనటులతో కలిసి పనిచేసే అవకాశం రావడం కూడా నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను."ఎడిటర్ ప్రభాత్ రెడ్డి మాట్లాడుతూ, "అందరికీ నమస్కారం. హేమల్‌తోనే నా ఫిల్మ్ మేకింగ్ జర్నీ కూడా ప్రారంభమైంది. హేమల్ నాకు చాలా సన్నిహితమైన స్నేహితుడు. మేమిద్దరం కాలేజీ రోజుల్లో కలిసి మా మొదటి షార్ట్ ఫిల్మ్ చేశాం. ఇప్పుడు ఇన్ని సంవత్సరాల తర్వాత మరోసారి కలిసి 'పాటకు ప్రాణం' సినిమాతో పనిచేస్తుండటం చాలా సంతోషంగా, ఎగ్జైటింగ్‌గా ఉంది. మళ్లీ హేమల్‌తో కలిసి ఈ జర్నీలో భాగం కావడం ఎంతో ఆనందంగా ఉంది."

నటీ నటులు: సుదర్శన్, సాత్విక,తనికెళ్ల భరణి,రాజీవ్ కనకాల, అనితా చౌదరి, రఘు కారుమంచి, బ్రహ్మాజీ తదితరులు.

సాంకేతిక వర్గం :
రచన ఓ దర్శకత్వం: హేమల్ తుమ్మపూడి
నిర్మాతలు: శ్రీరామ్ తుమ్మపూడి, హేమల్ తుమ్మపూడి
కో-ప్రొడ్యూసర్: సి.ఆర్. చక్రవర్తి
ఛాయాగ్రహణం: సంజీత్ సింగ్
కూర్పు: ప్రభాత్ రెడ్డి బండ
సంగీతం: శేఖర్ చంద్ర
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబీ రెడ్డి
ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: అక్కినేని శ్రీనివాస రావు
పీఆర్ఓ : దినేష్ కోయ

# ఈ నెల 18న హీరో కిరణ్ అబ్బవరం సమర్పణలో కేఏ ప్రొడక్షన్స్, పౌర్ణమి ఎంటర్ టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఇంట్రెస్టింగ్ మూవీ "హతః" టీజర్ రిలీజ్

**జన తెలంగాణ సినిమా**



పౌర్ణమి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ తో కలిసి హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్ లో నిర్మిస్తున్న సినిమా "హతః". ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్పణలో శివశంకర నాయుడు. వై నిర్మిస్తున్నారు. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్నారు. "హతః" సినిమాలో కుష్లు, రెహమాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టుస్వామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా టీజర్ అనౌన్స్ మెంట్ చేశారు. ఈ నెల 18న "హతః" సినిమా టీజర్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్ తో ఈ మూవీ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో సినిమా టీజర్ పై మంచి అంచనాలు ఏర్పడుతున్నాయి. "హతః" సినిమామాలో కొత్త తరహా కథను స్క్రీన్ మీద ప్రెజెంట్ చేయబోతున్నారు అనే ఇంప్రెషన్ మూవీ లవర్స్ లో ఏర్పడుతోంది.

నటీనటులు - రెహమాన్, కుష్లు, తనూజ పుట్టుస్వామి, నమ్రిత.ఎంవీ, తదితరులు

టెక్నీషియన్స్
-------------------
పబ్లిసిటీ డిజైన్ - అనంత్ కంచెర్ల
కాస్ట్యూమ్ డిజైనర్ - మేఘన గుమ్మడి
ఆర్ట్ డైరెక్టర్ - మక్కెన విజయ్ కుమార్, జీమోన్
వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ - జునైద్ ఉల్లా, హైకా స్టూడియోస్
అసోసియేట్ ప్రొడ్యూసర్ - రితికేష్ గోరక్
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - అల్లు బాలకృష్ణ
లైన్ ప్రొడ్యూసర్ - వెంకట్ రాహుల్
ఎడిటర్ - అఖిల్ చక్రవర్తి
మ్యూజిక్ - జేసిన్ జార్జ్
కో ప్రొడ్యూసర్స్ - వినీల సాహిత్య, కుష్లు
బ్యానర్స్ - కేఏ ప్రొడక్షన్స్, పౌర్ణమి ఎంటర్ టైన్ మెంట్స్
ప్రొడ్యూసర్స్ - కిరణ్ అబ్బవరం, శివశంకర నాయుడు. వై
స్క్రిప్ట్, డీవోపీ, డైరెక్షన్ - అనుష్ గోరక్
పీఆర్ఓ - సురేష్ (ఎస్ కే మీడియా)

# హిట్ మెషిన్ అనిల్ రావిపూడి చేతుల మీదుగా చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్ న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ 'బా బా బ్లాక్ షీప్' నుంచి సెకండ్ సాంగ్ 'వెవెలా ఊహలే చూపినా..' సాంగ్ రిలీజ్

**- అక్టోబర్ 9న సినిమా భారీ విడుదల**

**జన తెలంగాణ సినిమా**

అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రూపొందుతోన్న న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ 'బా బా బ్లాక్ షీప్'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోనేపూడి నిర్మిస్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. అక్టోబర్ 9న సినిమా రిలీజ్ అవుతుంది. టిను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్, అక్షయ్ , విష్ణు, కార్తికేయ, విస్మయశ్రీ, మాళ్వీ మల్హోత్రా, కశ్యప్, రాజారవీంద్ర తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మేఘాలయా రాష్ట్రంలో పూర్తిగా చిత్రీకరణను జరుపుకున్న తొలి దక్షిణాది సినిమా ఇదే కావటం విశేషం. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, రీసెంట్‌గా రిలీజైన 'ఆజా మేరీ జాని' సాంగ్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా నుంచి సెకండ్ సాంగ్ 'వెవెలా ఊహలే చూపినా..'ను రిలీజ్ చేశారు. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి ఈ పాటను విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'వెవెలా ఊహలే చూపినా..' సాంగ్ నేపథ్యం విషయానికి వస్తే..తమకు కావాల్సిన ఓ అరుదైన బాక్స్ కోసం విలన్ గ్యాంగ్ వెతుకుతుంటుంది. అది హీరో, హీరోయిన్ దగ్గర ఉందని వారు భావిస్తుంటారు. అదే సమయంలో వాళ్లు విలన్స్ కంటపడతారు. మరోవైపు హీరో చేతిలో గన్ ఉంటుంది..అది ఊహించని రీతిలో పేలుతుంది. దీంతో హీరోహీరోయిన్‌లపై గ్యాంగ్ రివర్స్ ఫైరింగ్ స్టార్ట్ చేస్తారు. ఈ నేపథ్యంలో రేట్రో స్టైల్లో 'వెవెలా ఊహలే చూపినా..' సాంగ్ ప్లే అవుతుంటుంది. ఈ సాంగ్‌ను కిట్టు విస్సాప్రగడ రాయగా..శ్రీ





సాగర్ పాడారు. పాటను మళ్లీ మళ్లీ వినాలనిపించేలా డిఫరెంట్ బ్యాక్ డ్రాప్, మ్యూజిక్‌తో ఆసాంతం ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా..చిత్ర నిర్మాత వేణు దోనేపూడి మాట్లాడుతూ "ఇప్పటి వరకు రిలీజైన మా బా బా బ్లాక్ షీప్ మూవీ టీజర్, అజా మేరీ జాని సాంగ్‌కు సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు 'వెవెలా ఊహలే చూపినా..' అనే సాంగ్‌ను మీ ముందుకు తీసుకొస్తున్నాం. డిఫరెంట్ స్టైల్లో సాగే పాట ఇది. ఈ సాంగ్‌ను రిలీజ్ చేసిన మా అనిల్ రావిపూడిగారికి థాంక్స్. సినిమాను అక్టోబర్ 9న రిలీజ్ చేస్తున్నాం. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ ఫైనల్ స్టేజ్‌లో ఉన్నాయి. మేఘాలయాలోనే పూర్తి సినిమాను కంప్లీట్ చేశాం. అక్కడే మొత్తం సినిమా షూటింగ్‌ను పూర్తి చేసుకున్న తొలి సౌత్ మూవీ ఇదే. ముఖ్యంగా చిరపుంజి వంటి అద్భుతమైన లొకేషన్స్‌లోనూ చిత్రీకరించాం. పక్కా ప్లానింగ్‌తో సినిమాను కంప్లీట్ చేశాం. మా డైరెక్టర్ గుణి, నటీనటులు, సాంకేతిక నిపుణులు సహా ఎంటైర్ టీమ్ సహకారంతో ఇది సాధ్యమైంది" అన్నారు.

నటీనటులు :
టిను ఆనంద్, ఉపేంద్ర , జార్జ్ మరియన్, అక్షయ్, కార్తికేయ, అభినవ్, శుభలేఖ సుధాకర్, హర్ష, కిషోర్ కృష్ణ, విస్మయశ్రీ, మాళవి, సమృద్ధి, విష్ణు ఓయ్, కశ్యప్, రాజా రవీంద్ర, కె.ఎల్.దామోదర్ ప్రసాద్, అనీష్ కురివిల్లా, కాదంబరి కిరణ్ తదితరులు

సాంకేతిక బృందం :
బ్యానర్ : చిత్రాలయం స్టూడియోస్
నిర్మాత : వేణు దోనేపూడి
సహ నిర్మాత: కొండల్ జిన్నా
దర్శకత్వం : గుణి మంచికంటి
క్రియేటివ్ ప్రొడ్యూసర్: శ?వేత దోనేపూడి
సంగీతం : స్టీఫెన్, ఆనంద్
ఆర్ట్ : సాహి సురేష్
ఎడిటింగ్ : విజయ్ ముక్తవరపు
కెమెరామెన్ : అజయ్ అబ్రహం జార్జ్
కో డైరెక్టర్ : కిషోర్ కృష్ణ
ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వైశాఖ్ నాయర్, శ్రీద దోనేపూడి
కాస్ట్యూమ్స్ : ప్రియాంక శ్రీనివాస్
కొరియోగ్రఫీ : జెడి. మాస్టర్
యాక్షన్స్ : వింగ్ చున్ అంజి
పి.ఆర్.ఒ : మోహన్ తుమ్మల

# కన్నడ నటుడు అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు



కన్నడ నటుడు అనంత్ నాగ్ (ూఅఖుత్ ఛీఖుస్త్ర)ను 2024కు గాను ప్రతిష్మాత్మక దాదాసాహెబ్ ఫాల్కే (ఖుఝుయిఖుష్ట్రవఎ ౕాష్ఝుశ్రీనెవ ూఝుతీఎ) అవార్డు వరించింది. భారతీయ సినిమాకు అందించిన సేవలు, విశిష్టమైన సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డును ప్రకటించినట్లు కేంద్రం తెలిపింది. ఈనెల 22న గుజరాత్‌లోని కేవడియాలో 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. అనంత్‌నాగ్ కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠి, మలయాళ, ఇంగ్లిష్ భాషల్లో 300పైగా సినిమాల్లో నటించారు. థియేటర్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన.. 1973లో కన్నడ చిత్రం 'సంకల్ప' చిత్రసీమలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత శ్యామ్ బెనెగల్ రూపొందించిన 'మంథన్', 'కొండుర', 'కల్‌యుగ్' తదితర చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించారు. ఆర్‌కే నారాయణ్ కథల ఆధారంగా తెరకెక్కించిన ప్రసిద్ధ టెలీ సీరియల్ 'మాల్గుడి డేస్'లో ఆయన మిఠాయివాలా పాత్రను పోషించారు. బయలుదారి, కన్నేశ్వర రామ, గోది బణ్ణ సాధారణ మైకట్టు, రాజకుమార, గాలిపట-2, కేజీఎఫ్ వంటి చిత్రాలు ఆయనకు మంచి పేరు తీసుకొచ్చాయి. తెలుగులో ప్రేమలేఖలు, అనుగ్రహం, భీష్మ, బాలు, శంఖారావం వంటి చిత్రాల్లో నటించారు. వెండితెర మీదే కాదు కర్ణాటక రాజకీయాల్లోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. మల్లేశ్వరం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలందించారు. 2025లో అనంత్ నాగ్ కీర్తి కిరీటంలో 'పద్మభూషణ్' చేరింది.

# ప్రసాద్ ల్యాబ్‌లో వైభవంగా 'నీ నానుండి దూరంగా' గ్రాండ్ సాంగ్ లాంచ్

**జన తెలంగాణ సినిమా**

మీవీ ప్రొడక్షన్ నిర్మాణంలో రూపొందిన 'నీ నానుండి దూరంగా' సాంగ్ లాంచ్ కార్యక్రమం ఇటివలే హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో వైభవం గాజరిగింది.

ఈ కార్యక్రమానికి ప్రముఖ సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల, ప్రముఖ నటుడు వికాస్ వశిష్ఠ ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

'నీ నానుండి దూరంగా' సాంగ్ ను జ్ఞానానంద దర్శకత్వంలో రూపొందించారు .చిత్రానికి రామ్‌చరణ్ మాటూరి సంగీతాన్ని అందించారు. ప్రేమ, భావోద్వేగాలకు ప్రాధాన్యతనిస్తూ తెరకెక్కిన ఈ సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని చిత్ర బృందం తెలిపింది.

ఈ సాంగులో హీరోగా అభిరామ్ పాత్రలో గిరిధర్ నటిస్తుండగా, హీరోయిన్‌గా జానకి పాత్రలో మధు కనిపించనున్నారు.




గ్రాండ్ సాంగ్ లాంచ్ సందర్భంగా సంగీతం, పాటలు

ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటాయని ముఖ్య అతిథులు పేర్కొన్నారు. చిత్ర బృందానికి తమ అభినందనలు తెలియజేశారు.

: నీ నానుండి దూరంగా సాంగ్
నిర్మాణ సంస్థ: మీవీ ప్రొడక్షన్స్
క్రియేటెడ్ బై: జ్ఞానానంద
సంగీతం: రామ్‌చరణ్ మాటూరి
హీరో: గిరిధర్
హీరోయిన్: మధు --
పి ఆర్ ఓ: వీరబాబు

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
గురువారం సెప్టెంబర్ 17,2026

# రూ.350 కోట్ల స్టార్.. చర్చంతా ఆమె బరువుపైనే..!

బాలీవుడ్ బ్యూటీ కత్రినా కైఫ్ పేరు చెప్పగానే అందం, అభినయంతో పాటు ఆమె ఫిట్‌నెస్ గుర్తొస్తుంది. రెండు దశాబ్దాల నుంచి అగ్రహీరోలకు జోడీగా మెప్పిస్తూ.. 'కే బ్యూటీ' బ్రాండ్‌తో వ్యాపారం రంగంలోనూ తనదైన స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఇంత గుర్తింపు సాధించిన ఆమె గురించి ఇప్పుడు సోషల్ మీడియాలో జరుగుతోన్న చర్చ మాత్రం విస్మయానికి గురిచేస్తోంది.ఇటీవల అంబానీ ఇంట జరిగిన వినాయక చవితి వేడుకలకు భర్త విక్కీ కౌశల్‌తో కలిసి కత్రినా హాజరయ్యారు. ఆ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తల్లి అయ్యాక కత్రినా చాలా హుందాగా ఉన్నారంటూ కొందరు కామెంట్ చేయగా.. మరికొందరు మాత్రం ప్రసవానంతరం ఆమె శరీరాకృతిలో వచ్చిన మార్పులపై వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉన్న ఫొటోలతో పోలుస్తూ ఆమె బరువు గురించి మాట్లాడుతున్నారు. 'ఆమె పని అయిపోయింది.. వృద్ధాప్యం వచ్చేసింది' అంటూ ట్రోల్స్ చేస్తున్నారు.దీంతో మహిళలతో పాటు పలువురు అభిమానులు కత్రినాకు మద్దతుగా నిలుస్తున్నారు. 2025 నవంబర్‌లో ఈ నటి బాబుకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. ప్రసవం తర్వాత శరీరంలో మార్పులు సహజమే. ప్రతి మహిళ తిరిగి మునుపటి



రూపంలోకి రావడానికి పట్టే సమయం ఒకేలా ఉండదు. కత్రినా విషయంలోనూ అదే జరిగింది. ఈ సమయంలో ఆమెపై ట్రోల్స్ రావడంపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ తల్లి శరీరాకృతిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమంటూ ప్రశ్నిస్తున్నారు. ఒక మహిళను గౌరవించడంలో.. ఆమె రూపం మాత్రమే ప్రామాణికం కాదని.. ప్రతిభ, విజయాలే అసలైన కొలమానాలని అంటున్నారు. 2003లో 'బూమ్' చిత్రంతో కత్రినా కైఫ్ తన కెరీర్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి ఎన్నో హిట్ సినిమాల్లో నటించారు. ఆమె ఒక్కో ప్రాజెక్ట్‌కు రూ.10 కోట్లకు పైగా పారితోషికం తీసుకుంటారని.. 2024 జీక్యూ ఇండియా నివేదిక వెల్లడించింది. ఇక మరోవైపు ఆమె బ్రాండ్ 'కే బ్యూటీ' 2025–2026 ఆర్థిక సంవత్సరంలో రూ.350 కోట్ల విలువైన అమ్మకాలను నమోదు చేసిందని అంచనా. ఆమె సాధించిన ఈ విజయాల గురించి మాట్లాడుకోకుండా బరువుపై విమర్శలు రావడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



## ఎం.ఎస్.సుబ్బులక్ష్మిగా రష్మిక ఖరారు

దిగ్గజ గాయని, భారతరత్న ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవిత కథని తెరపైకి తీసుకురావడానికి చిత్రసీమలో ఎప్పట్నుంచో సన్నాహాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాల్ని అధికారికంగా వెల్లడించింది చిత్రబృందం. కొన్ని రోజులుగా అనుకుంటున్న రష్మికనే చిత్ర బృందం ఎట్టకేలకు ఖరారు చేసింది. గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించనున్న ఈ చిత్రాన్ని అల్లు అరవింద్, రాక్ లైన్ వెంకటేశ్, బన్నీవాస్ సంయుక్తంగా నిర్మించనున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు. నేడు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి 110వ జయంతి సందర్భంగా ఈ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ని అగ్రతార కమల్ హాసన్ చేతుల మీదుగా చెన్నైలో ప్రారంభించనున్నట్లు ప్రకటించింది చిత్రబృందం.

## సుప్రీంకోర్టుకు శ్రీదేవి చెన్నై ఆస్తి వివాదం.. యథాతథ స్థితికి ఆదేశం



దివంగత నటి శ్రీదేవి చెన్నై ఆస్తి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. తాజాగా ఆ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్డులో ఉన్న ఈ స్థలంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సర్వోన్నత న్యాయస్థానం.. తదుపరి విచారణ వరకు అక్కడ యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని ఆదేశించింది. ఆస్తి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఇరువర్గాలకు సూచించింది.శ్రీదేవి 1988లో చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్డులో 4.77 ఎకరాల స్థలాన్ని ముదలియార్ అనే వ్యక్తి కుటుంబం నుంచి కొనుగోలు చేశారు. దశాబ్దాలుగా ఇది శ్రీదేవి కుటుంబం ఆధీనంలోనే ఉంది. శ్రీదేవి మరణానంతరం 2023లో ఆస్తి మార్పిడి కోసం దరఖాస్తు చేసుకోగా.. ముదలియార్ రెండో భార్య పిల్లలైన ఎం.సి.శివగామి, ఆమె సోదరుడు ఈ ఆస్తిలో తమకూ వాటా ఉందంటూ చెంగల్పట్టు కోర్టులో సివిల్ కేసు వేశారు.రూ.350 కోట్ల స్టార్.. చర్చంతా ఆమె బరువుపైనే..!ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ శ్రీదేవి భర్త బోనీ కపూర్, కుమార్తెలు జాన్వీ, ఖుషీ కపూర్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు . మొదటి భార్య ప్రాణాలతో ఉండగానే ముదలియార్ రెండో పెళ్లి చేసుకున్నారని, కాబట్టి రెండో భార్య పిల్లలకు చట్టపరంగా వారసత్వ హక్కులు ఉండవని వాదించారు. వారితో ఏకీభవించిన మద్రాస్ హైకోర్టు.. కింది కోర్టు తీర్పులో జోక్యం చేసుకుంటూ శివగామి వేసిన సివిల్ కేసును కొట్టివేసింది.మద్రాస్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ శివగామి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసు ప్రాథమిక దశలో ఉండగానే హైకోర్టు లోతుగా విచారణ (మినీ–ట్రయల్) జరిపిందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. కపూర్ కుటుంబం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. 1988లో జరిగిన కొనుగోలుపై ఇన్నేళ్ల తర్వాత (2025లో) కేసు వేయడం సరికాదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పిటిషనర్లు 1995, 1999లోనే మేజర్లు అయ్యారని గుర్తుచేశారు. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది. ఇందుకోసం ఓ విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తిని నియమిస్తామని తెలుపుతూ తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది.



## హాలీవుడ్‌లోకి 'మహారాజ'.. మొదటి తమిళ సినిమాగా రికార్డు..

విజయ్ సేతుపతి ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'మహారాజ' . నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా భారీ విజయాన్ని సాధించి.. ఆయన కెరీర్‌లోనే మంచి గుర్తింపు తెచ్చిన చిత్రంగా నిలిచిపోయింది. ఇప్పుడీ సినిమా హాలీవుడ్‌లో రీమేక్ కానుంది. ఎన్నో రోజులుగా దీనిపై వార్తలు వస్తున్నప్పటికీ తాజాగా హాలీవుడ్ నిర్మాణ సంస్థ 'ప్యాషన్ స్టూడియోస్' ఈసినిమాను రీమేక్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది దీనిని ఓ మైలురాయిగా పేర్కొన్న నిర్మాణ సంస్థ.. హాలీవుడ్‌లో రీమేక్ కానున్న మొదటి తమిళ సినిమాగా ఇది రికార్డు సాధించిందని తెలిపింది. ఇక 'మహారాజ' హాలీవుడ్ రీమేక్‌లో విజయ్ సేతుపతి పాత్రను ఆస్కార్ విన్నర్, స్టార్ హీరో మాథ్యూ పోషించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. త్వరలోనే నటీనటుల వివరాలు వెల్లడించే అవకాశముంది. విజయ్ సేతుపతి 50వ చిత్రంగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మహారాజ'.. ఆయనకు ఉత్తమ నటుడిగా పలు అవార్డులు తీసుకువచ్చింది. తమిళ, తెలుగు భాషలతో పాటు చైనాలో విడుదల చేయగా అక్కడ కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది.

## నీ విలువ తెలిసింది.. కాపాడమ్మా!



'నా బిడ్డని కాపాడు.. నీ మొక్కు చెల్లిస్తా.. నీకు సమర్పించడానికి నా దగ్గర ఏమీ లేదు.. నా ప్రాణాలు తప్ప..' అంటూ ఓ భక్తురాలు తన బిడ్డ క్షేమం కోసం అమ్మవారిని వేడుకుని ప్రాణం అర్పించింది. మరి ఆ అమ్మ అనుగ్రహించి బిడ్డని కాపాడిందా? లేదా? అనేది తెలియాలంటే 'మహాశక్తి' సినిమా చూడాలంటోంది ఆ చిత్రబృందం. అగ్ర కథానాయిక నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న ఈ సినిమాని సుందర్ సి తెరకెక్కిస్తున్నారు. ఈషారీ కే గణేశ్ నిర్మిస్తున్నారు. రెజీనా, ఊర్వశీ, దునియా విజయ్, యోగిబాబు, సునీల్ తదితరులు కీలక పాత్రాధారులు. 'ది రైజ్ ఆఫ్ మహాశక్తి' పేరుతో ఈ సినిమా టీజర్‌ని సోమవారం విడుదల చేశారు. 'శత్రువులొచ్చేశారు.. మనం ప్రాణం అడ్డుపెట్టైనా సరే రాకుమారుణ్ని కాపాడుకోవాలి..' అంటూ ప్రారంభమైన టీజర్లో ప్రతినాయిక ఛాయలున్న పాత్రలో రెజీనా కనిపించిన తీరు.. నయనతార ఎంట్రీ, 'మమ్మల్ని కాపాడాల్సిన నువ్వే ఇలా వదిలేసి వెళ్తావా', 'ఆ రోజు నీ విలువ తెలుసుకోలేకపోయాం.. ఇప్పుడేనమ్మా నీ విలువ తెలుస్తుంది.. కాపాడమ్మా' లాంటి సంభాషణలతో ఆసక్తిగా సాగిందీ టీజర్. డివోషనల్ ఎంటర్‌టైనర్ 'మూకుత్తి అమ్మన్'(అమ్మోరు తల్లి)కి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రమిది. దీపావళి పండగ సందర్భంగా తమిళ, తెలుగు, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో నవంబరు 6న విడుదల కానుంది.

Published at H.NO. 1-107/3, PALAKURTHIVILLAGE, RAMAGUNDAM DIST, KARIMNAGAR TELANGANA Editor: R. CHAITANYA, RNI NO. TELTEL/2014/61071 Cell: 9701676775